క్లుప్తంగా

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



నెక్కొండ : మండలంలోని రెడ్లవాడలోని రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్‌డీఎఫ్) హై స్కూల్ విద్యార్థి భూక్యా మోక్షిత్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో మోక్షిత్‌ను హెచ్‌ఎం చేరాలు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. అనంతరం హెచ్‌ఎం చేరాలు మాట్లాడారు. స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న మోక్షిత్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసేందుకు ఎంపికయ్యాడని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ జనరల్ సెక్రటరీ కిరణ్, ఇన్‌చార్జ్‌లు రవి, రాజు, పీఈటీ నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన బత్తిని రాజేందర్‌కు మంజూరైన రూ.25 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రాజేందర్‌కు సాయం మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచ ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ మేడి వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ అమీరుద్దీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మెంబర్ కన్నం కుమార్, మాజీ వార్డు సభ్యులు మేడి సంతోశ్, నాయకులు మండల రవి, ఉప్పరి కొమురయ్య, తాళ్ల సమ్మయ్య, మహేందర్, అన్న కొమురయ్య, ఎదరబోయిన ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట : స్థానిక మున్సిపల్ ఏఈగా పని చేస్తూ డీఈగా ఉద్యోగోన్నతి పొందిన రాజేశ్‌ను ఏఐసీటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మాషుక్, నాయకులు గురువారం శాలువాతో సన్మానించారు. అనంతరం మాషుక్ మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్థత చాటి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తద్వారానే ఉద్యోగానికి న్యాయం చేయగలరని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గోనెల శ్రీనివాస్, చందు, అనిల్ మహేంద్ర, గాజుల శ్రీను, పవన్, శ్రీధర్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడికి..



చెన్నారావుపేట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బాల్నె వెంకన్నను సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బోడ మురళీ నాయక్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. అనంతరం వెంకన్న మాట్లాడారు. తనను ఎన్నుకున్నందుకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు అనుముల కుమారస్వామి, కొండవీటి ప్రదీప్‌కుమార్, అమ్మ రాజేశ్, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, నాయకులు సాయిలు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో నిర్లక్ష్యం'

నర్సంపేట రూరల్ : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్‌ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కొడారి రవి విమర్శించారు. నర్సంపేట మండలంలోని రామవరంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు పాతకాల కొమ్మాలు అధ్యక్షతన పార్టీ నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశానికి రవి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని శ్రేణులను కోరారు.

బిల్లులు పెండింగ్‌పై నేడు ధర్నా

దుగ్గొండి : సర్పంచ్‌లకు బకాయి ఉన్న బిల్లుల విడుదల డిమాండ్ చేస్తూ నేడు (శుక్రవారం) హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు తిమ్మంపేట మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన గురువారం మాట్లాడారు. గ్రామాల్లో అప్పు చేసి అభివృద్ధి పనులు చేపట్టగా బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లకు బకాయి ఉన్న రూ.1200 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు.

యథేచ్ఛగా మొరం దందా

- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమాలు

సంగెం : మండలంలో యథేచ్ఛగా మొరం దందా సాగుతోంది. పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ రవాణాకు పాల్పడుతున్న పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులకు మొరం అవసరం ఉండగా ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని సాకుగా చేసుకుని గ్రామాల్లో రాత్రింబవళ్లు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తూ మొరం తవ్వకాలు చేపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో లబ్ధిదారులకు మాత్రమే కాకుండా ఇతరులకు మొరం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటూనే ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అధికార పార్టీ నాయకుల అండతో మొరం అక్రమ రవాణా సాగుతోందన్న విమర్శలున్నాయి.

నిబంధనల ఉల్లంఘన

మండలంలోని చింతలపల్లి, మొండ్రాయి, కాట్రపల్లి, రామచంద్రాపురం, లోహిత తదితర గ్రామాల్లో ఎస్సారెస్పీ కెనాల్, చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా అక్రమ మొరం తవ్వకాలు చేపట్టి విధ్వంసం సృష్టిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంలో అంతర్యం ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం 3 ఫీట్ల లోతు కంటే ఎక్కువ తవ్వకాలు జరపవద్దు. అంతట ఒకే లోతులో తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. కానీ చెరువులు, కుంటల్లో 15 నుంచి 20 ఫీట్లకు పైగా గుంతలు తీస్తు ఇష్టానుసారంగా మొరం తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా చెరువులు, కుంటలు ధ్వంసం కాకుండా చూడాల్సిన ఐబీ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. రోడ్లు ధ్వంసం అవుతుంటే ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న అపవాదు ఉంది. ఇక అటు రెవెన్యూ, ఇటు పోలీసులు అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టి వ్యాపారులు ఆడిందే ఆట పాడింటే పాట అన్న చందంగా అధిక ధరలకు మొరం విక్రయిస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు కుంటల్లో భారీ గుంతల వల్ల నీటితో నిండినపుడు పిల్లలు, ఈతరాని వారు పడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ మొరం దందాను అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



రామచంద్రపురంకుంటలో ఏర్పడ్డ భారీ గుంత



రామచంద్రాపురంలో..



చింతలపల్లిలో మొరం తవ్వుతున్న వాహనం

లస్కర్ సెల్‌ఫోన్ లాక్కున్న మాఫియా

అధికారుల ఆదేశాల మేరకు మొరం తవ్వకాలను ఆపడానికి వెళ్లిన ఐబీ లస్కర్ సెల్‌ఫోన్‌ను లాక్కున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. బాధిత లస్కర్ సుదర్శన్ కథనం ప్రకారం.. ఈనెల 15న రామచంద్రాపురంలోని కుంటలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఐబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఐబీ అధికారి ఆదేశాల మేరకు లస్కర్ మొరం తవ్వకాలు జరుపుతున్న ప్రదేశానికి వెళ్లాడు. మొరం తవ్వకాలు చేపట్టిన్న మాఫియాలోని ఒక వ్యక్తి లస్కర్ సెల్‌ఫోన్ లాక్కుని బెదిరించి వెళ్లగొట్టాడు. పోలీస్‌స్టేషన్‌లో లస్కర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు సదరు మొరం మాఫియా లాక్కున్న సెల్‌ఫోన్‌ను లస్కర్‌కు తిరిగి అప్పగించారు. దీనిపై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా విచారణ చేస్తున్నామన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



నెక్కొండ: మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ



వర్ధన్నపేట : వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు



నర్సంపేట : విద్యార్థిని పరీక్షిస్తున్న డాక్టర్ సరోజ

- డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్

నెక్కొండ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్ కోరారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని రెడ్లవాడలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో జ్వరపీడితులను గుర్తించి చికిత్స అందించాలని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం వైద్యాధికారి సుమన్ మాట్లాడారు. జ్వరపీడితులు జాప్యం చేయకుండా ఆస్పత్రిని సందర్శించి వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మౌనిక, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి

వర్ధన్నపేట : సమాజంలోని ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్‌సెంటర్–2 వైద్యుడు సురేశ్‌కుమార్ కోరారు. మండలంలోని ఇల్లందలోని ఎస్సీ కాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ సురేశ్‌కుమార్ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి రామారావు, ఏఎన్‌ఎం సరోజన, అపరంజి, ఆశ కార్యకర్తలు శోభ, కోమల, తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో..

నర్సంపేట : వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డాక్టర్ సరోజ తెలిపారు. చెన్నారావుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అమీనాబాద్ మోడల్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యురాలు మాట్లాడారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, దోమ తెరలు వాడాలని సూచించారు.

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆధ్వర్యంలోని బృందం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వం గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిపించడం లేదన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు, రైతులు, వ్యాపారస్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నర్సింహరాములు, పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రాంచందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, ఎస్సీ మోర్చా జిల్లా కన్వీనర్ కూనమల్ల పృథ్వీ, శీలం సత్యనారాయణ, కుంభం కోమల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, నాయకులు నూతనకంటి శ్రీనివాస్, చిరంజీవి, కొండపాక మధు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకే అవకాశం కల్పించాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు భారతి

నర్సంపేట : రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న 210 పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల్లో ఉపాధ్యాయులుగా పని చేయడానికి అంగన్‌వాడీ టీచర్లకే అవకాశం కల్పించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(బీఆర్‌టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి కోరారు. ఈ మేరకు ఆమె ఆధ్వర్యంలోని బృందం మహిళ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అనిత రామచంద్రన్, ఐసీడీఎస్ జేడీ అంకేశ్వరరావులకు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం భారతి మాట్లాడారు. పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల్లో వాలంటీర్లను నియమించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.రమాతార, కోశాధికారి వేదవతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, సహాయ కార్యదర్శి విమల, రాష్ట్ర నాయకులు రజిత, ఎల్లమ్మ, రాధ, శిరీష, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న భారతి, నాయకులు

మొక్కల పంపిణీ



వర్ధన్నపేట : వన మహోత్సవంలో భాగంగా మండలంలోని కడారిగూడెంలో ఇంటింటికీ ఆరు చొప్పున పూల, పండ్ల మొక్కలను గ్రామ పంచాయతీ సిబ్బంది గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ బత్తిని సంధ్య మాట్లాడారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది కొమురయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : నూతన సబ్‌స్టేషన్‌లోని ద్వారకపేట టవర్ లైన్ మరమ్మతు నేపథ్యంలో పట్టణంలోని బస్టాండ్ ఏరియా, వరంగల్ రోడ్డు, అయ్యప్ప ఆలయ పరిసరాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ విజయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బ్రిడ్జి నిర్మాణానికి సాయం



నగదు అందిస్తున్న భరత్

గీసుకొండ : మండలంలోని మనుగొండలో రైతులు, రజకులు పంట చేలకు వెళ్లేందుకు కాల్వ దాటే క్రమంలో ఇబ్బంది పడుతుండగా బ్రిడ్జి నిర్మాణానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు రడం భరత్ గురువారం రూ.25 వేల సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాల్వపై బ్రిడ్జి నిర్మాణంతో సమస్య పరిష్కారం కానుందన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం అందేలా ప్రయత్నిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, రజకులు చాపర్తి నాగరాజు, కనకయ్య, నర్సింహరాములు, సుధాకర్, సమ్మయ్య, సురేశ్, అశోక్, విశాల్, రాజు తదితరులు పాల్గొని రడం భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలకు స్వర్ణప్రాశన చేయించండి



సమావేశంలో మాట్లాడుతున్న వికాస తరంగిణి బాధ్యుడు కృష్ణారావు

- వికాస తరంగిణి బాధ్యుడు కృష్ణారావు

నర్సంపేట : పట్టణానికి చెందిన రెండు నుంచి 16 ఏళ్లలోపు వయస్సులైన పిల్లలకు ఈనెల 25న పుష్యమి నక్షత్రం సందర్భంగా స్వర్ణప్రాశన చేయించాలని వికాస తరంగిణి బాధ్యులు కృష్ణారావు కోరారు. పట్టణంలోని శ్రీసత్యసాయి ఆలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆయుర్వేదంలో సూచించిన మూలికలు, తేనె, స్వచ్ఛమైన వెన్నతో తయారు చేసినట్లు తెలిపారు. పుష్యమి నక్షత్రం రోజున స్వర్ణప్రాశన చేయిస్తే పిల్లల మేధస్సు, జ్ఞాపకశక్తి, రోగ నిరోధక శక్తి పెరుగుతాయని వివరించారు. ఈనెల 25వ వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వర్ణప్రాశన వేయించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వికాస తరంగిణి బాధ్యులు రంగనాథస్వామి, వేంశెట్టి శ్రీనివాస్, రామారావు, సట్ల వీరయ్య, మల్యాల వినయ్ రేణుక, వడ్డే లక్ష్మి, మార్త రాజేందర్, ఎర్రబోయిన రాజశేఖర్, చల్లా వెంకట్‌రెడ్డి, కోట కల్పన, సరిత, త్రివేణి, గర్నెపెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అప్‌గ్రేడేషన్‌కు ఎన్నాళ్లు?

- 30 పడకలతో ఏర్పాటుపై నిర్లక్ష్యం



మండల కేంద్రంలోని పీహెచ్‌సీ భవనం

దుగ్గొండి : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ఎన్నాళ్లు పడుతుందంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏటా వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడి మండల ప్రజలు వైద్యం కోసం వస్తుండగా అవసరమైన మేరకు పడకలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలువురు వరంగల్‌లోని ఎంజీఎం, ఇతర ప్రాంతాలను ఉన్నత శ్రేణి ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తుండగా తీవ్ర అనారోగ్య సమస్యల నేపథ్యంలో కొందరు కడు పేదరికంలోనూ ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ ఇబ్బంది పడుతున్నారు.

మండలంలో 42 వేల జనాభా ఉండగా ప్రభుత్వం మండల కేంద్రంలో, కేశవాపురంలో 6 పడకల పీహెచ్‌సీలు ఏర్పాటు చేసింది. మండల కేంద్రంలోని ఆస్పత్రిలో 24 గంటలూ, కేశవాపురంలోని ఆస్పత్రిలో 12 గంటలు వైద్యసేవలు అందుతున్నాయి. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి ప్రతిరోజూ సుమారు 100–150 మంది రోగులు వచ్చి వైద్యసేవలు పొందుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మండలంలోని రెండు పీహెచ్‌సీలకూ రోగుల తాకిడి పెరుగుతుండడంతో 2015లో నాటి ఎంపీ సీతారాంనాయక్ చొరవతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి నాటి ప్రభుత్వం నిర్ణయించింది. కాగా మండలంలోని రెండు పీహెచ్‌సీల్లోనూ 6 చొప్పున మాత్రమే పడకలు ఉన్న క్రమంలో జబ్బు తీవ్రతను బట్టి రోగులను చేర్చుకోవాల్సి వస్తే వరంగల్‌లోని ఎంజీఎంకు, ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. పదేళ్లు గడచినా మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరించడం లేదంటూ మండల ప్రజలు మండిపడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఏటా విషజ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులు మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్ పేషెంట్లుగా సేవలు పొందలేకపోతున్న దుస్థితి నెలకొందని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు మీడియా ఎదుట వాపోయారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరించి వసతులు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీ భవనం శిథిలం

మండల కేంద్రంలోని పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలు కురిస్తే భవనం ఉరుస్తోంది. సుమారు 42 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో స్లాబ్ పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారింది. మండల జనాభాకు అనుగుణంగా పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా ఉన్నతీకరించడంతోపాటు సత్వరమే నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ల్యాప్‌టాప్ బహూకరణ



రాయపర్తి : మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన గిద్దె రేణుక–మహిపాల్ దంపతుల కుమార్తె సుష్మిత వారణాసిలోని ఐటీలో సీటు సాధించగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో ల్యాప్‌టాప్ బహూకరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొండం రంగారెడ్డి, కొండం కృపాకర్‌రెడ్డి గురువారం ఆమెకు లాప్‌టాప్‌తోపాటు రూ.50 వేల నగదు అందజేసి అభినందించారు. అలాగే గట్టు నర్సింహాచార్యులు రూ.5 వేలు అందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని దేశంలో ప్రతిష్టాత్మకమైన సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సుష్మితకు విద్యాబోధన అందించిన రాంరెడ్డిని సైతం అభినందించారు. కార్యక్రమంలో తోట సోమనర్సయ్య, కత్తి రవీందర్, చందు విష్ణుమూర్తి, కునుసోతు శ్రీను, వల్లపు వెంకన్న, కునుసోతు సజ్జన్, సంకినని నవీన్, అనుముల యాదయ్య, గిద్దె యాకయ్య, చెవినబోయిన సమ్మయ్య, గిద్దె సాయిలు, గొరారపు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాయపర్తి : పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ కమిటీ సమన్వయకర్త రావుల భాస్కర్‌రావు కోరారు. మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు అబ్బోజు రామ్మోహనాచారి అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో భాస్కర్‌రావు విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చేపట్టకముందే ప్రభుత్వం డీఏలు విడుదల చేయాలని ఆకాంక్షించారు. సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు బిల్లా విజయలక్ష్మి, రామ్మూర్తి, చంద్రయ్య, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలి మృతి

పర్వతగిరి : ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. మండలంలోని ఏనుగల్‌కు చెందిన ఎర్రబెల్లి యాదగిరిరావు భార్య నిర్మల (62) కొద్ది రోజులుగా సోరియాసిస్‌తో బాధపడుతోంది. వ్యాధి తీవ్రతతో నిర్మల బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా గురువారం మృతి చెందింది.

రాములునాయక్‌తండాలో ఘనంగా తీజ్ వేడుకలు



గోధుమ బుట్టలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాములునాయక్‌తండాలో గిరిజనులు గురువారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు గోధుమ బుట్టలతో డీజే సౌండ్స్ నడుమ ర్యాలీగా గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లి నిమ్మజ్జనం చేశారు. తండాలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో తండా పెద్దమనిషి అంగోతు పూల్యానాయక్, యాకూబ్, ఈరు, నర్సయ్య, వెంక్య, రాజు, భద్రు, చందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.